
స్పెషల్ ఫీచర్



శాంతి సుధాకర్ మొండితోక

# గాయాలు పొందిన వైద్యుడు

ఆయన గాయాల మూలంగా మనకు స్వస్థత కలిగింది (యెషయా 53:5).

యేసుక్రీస్తును గాయాలు పొందిన వైద్యునిగా ఈ వచనం వర్ణిస్తోంది. మన ప్రభువు యేసుక్రీస్తు వారి కంటె ఎక్కువ లోతైన గాయాలూ దారుణ శ్రమలూ అనుభవించిన వారు ఈ మానవ చరిత్రలో, ప్రపంచ మతాల్లో ఎవరూ లేరు. యెషయా గ్రంథం, హెబ్రీ పత్రిక ఆయన్ని 'శ్రమలుపడిన సేవక – రక్షకుని'గా చూపిస్తున్నాయి.

***మానవ పాపం వల్ల కలిగిన సమస్యకు దేవుని పరిష్కారం - యేసుక్రీస్తు వారి గాయాలు!***

మానవ పాపం వల్ల కలిగిన సమస్యకు (ఎడబాటు, శ్రమలు, మరణం) కు దేవుని పరిష్కారం – యేసుక్రీస్తు వారి గాయాలు! ఇదే క్రీస్తునూ, క్రైస్తవ్యాన్నీ ఇతర దేవుళ్లు, మతాలన్నిటి నుండి వేరు చేస్తోంది.

ఆంగ్ల కవి ఎడ్వర్డ్ షిలిటో ఇలా రాసాడు...

*ఇతర దేవుళ్లు బలిష్ఠులు*
*కానీ నీవు బలహీనుడివి*
*వాళ్లు గెలుపు స్వారీ చేస్తూ సింహాసనమెక్కారు*
*కానీ నీవేమో*
*తడబడుతూ, తట్టుకుని నిలబడుతూ...*
*మా గాయాలతో మాట్లాడగలిగేది ఒక్క...దేవుని గాయాలే.*
*ఏ దేవుడు గాయాలు పొందాడు?*
*ఒక్క నీవు తప్ప!*

బాధలనుభవించడం, గాయాలు పొందటమే యేసుక్రీస్తు అసమాన విశిష్ఠత. క్రీస్తు సిలువ వేయబడడం లేక మెస్సీయా గాయాలు పొందటం అనే భావన యూదులకు అభ్యంతరకరంగానూ, గ్రీకులకు మూర్ఖత్వంగానూ అనిపించింది (1కొరింథీ 1:23). రోమను వారికైతే అదొక అంతుచిక్కని విరుద్ధాంశం.

***ఎనస్తీషియా ప్రభావం నుండి స్పృహలోకి రాగానే మొట్టమొదటిగా నా మనస్సుకు తట్టింది ఇదే : "దేవుని గాయాలు నా గాయాలకు పరిష్కారం"***

2007లో ఒక గుడ్ ఫ్రైడే సర్వీసులో నేను యేసుక్రీస్తు వారి గాయాల గురించి మాట్లాడాను. భారతదేశంలోని మూడుకోట్ల దేవుళ్లూ దేవతల్లో ఏ ఒక్కరికీ గాయాలు లేవనీ, ఎందుకంటే మానవుల కోసం శ్రమలనుభవించి, మరణించిన వారెవ్వరూ లేరనీ, ఒక్క క్రీస్తు గాయాలు మాత్రమే మన గాయాలతో మాట్లాడగలవనీ సంఘంలో బోధించాను. నాకేమి సంభవించబోతోందో నాకు తెలీకుండానే ఆ రోజు అలా మాట్లాడాను. సరిగ్గా అది జరిగిన రెండు వారాల తర్వాత నేను కేన్సర్ హాస్పిటల్‌లో పెద్ద రక్తసిక్త గాయంతో (సర్జరీవల్ల కలిగింది) ఉండాల్సి రావటంతో తీవ్ర దిగ్భ్రాంతికి గురయ్యాను.

ఎనస్తీషియా ప్రభావం నుండి స్పృహలోకి రాగానే మొట్టమొదటిగా నా మనస్సుకు తట్టింది ఇదే : "దేవుని గాయాలు నా గాయాలకు పరిష్కారం"

మానవ బాధల గురించిన ఎన్నో సంక్లిష్ట ప్రశ్నల్ని నేను ముఖాముఖిగా ఎదుర్కొన్నాను. వాటికి జవాబుల్ని నేను గాయాలు పొందిన వైద్యుడు యేసులో కనుగొన్నాను. అటువంటి కొన్ని ప్రశ్నల్ని మనమిప్పుడు పరిశీలిద్దాం.

## మంచి వారికి కీడెందుకు సంభవిస్తుంది?

క్రైస్తవులు, మరి ముఖ్యంగా పూర్తికాలం దేవుని సేవలో ఉన్నవారు ప్రాణాంతక పరిస్థితుల్ని ఎదుర్కొంటున్నప్పుడు వారి మనసుల్లో ఎన్నో ప్రశ్నలు తలెత్తుతాయి. దేవుని ప్రజలకు చెడెందుకు జరుగుతుంది? బాధ సంభవించినప్పుడు దేవుడెక్కడుంటాడు? సర్వశక్తిమంతుడూ, మంచివాడూ అయిన దేవుడు తన ప్రజలు బాధపడటాన్ని ఎలా అనుమతించగలడు? దేవుని భద్రత, మంచి ఆరోగ్యం, దీర్ఘాయువు వంటి వాగ్దానాల సంగతేంటి? మనం శ్రమల్లో నలిగిపోతుంటే, దేవుడేమి చేస్తుంటాడు? విచిత్రంగా నా సర్జరీకి ఒక్క వారం ముందర నేను కీర్తన 91 – 'ఏ తెగులూ నీ గుడారాన్ని సమీపించదు' పై ప్రసంగించాను. ఇటువంటి ప్రశ్నలతో నేను సతమతమవుతున్నప్పుడు దేవుని వాక్యమూ, నాలో నివసించే దేవుని ఆత్మ నాకెంతగానో సహాయపడ్డాయి. దేవుని సార్వభౌమాధికారం, మానవ శ్రమానుభవం పట్ల లోతైన అవగాహన కలిగించాయి. నా శ్రమను విశాల బైబిల్ దృక్పథంలో అర్థం చేసుకోగలిగాను. పరిస్థితులు తారుమారైనప్పుడు, తీవ్రమైన శ్రమ, నొప్పి, వేదనలో నన్ను నేను కనుగొన్నప్పుడు, దేవుని గురించిన, ఆయన వ్యక్తిత్వమూ, విధానాలూ, ఉద్దేశ్యాల గురించిన సరైన అవగాహనే నాకొక ఆచూకీ తెలిపి, నా జీవితంలోకి ఆదరణను తెచ్చింది. నా శ్రమలో, శ్రమ వెనుకా ఒక దైవిక సార్వభౌమ సంకల్పం ఉందన్న అవగాహన, నా శ్రమను నేను సంయమనంతో ఎదుర్కొనగలిగేలా చేసింది.

***దేవుని ప్రజలకు చెడెందుకు జరుగుతుంది? బాధ సంభవించినప్పుడు దేవుడెక్కడుంటాడు?***

## సరైన అవగాహన

జీవితంలో పరిస్థితులు చేయి దాటిపోయినప్పుడు, దేవుని గురించీ,

ఆయన విధానాల గురించీ సరైన, వాక్యానుసారమైన అవగాహన మనం తప్పనిసరిగా కలిగుండాలి. యోబు ఒక మంచి వేదాంతజ్ఞాని. తన మహాశ్రమల్లో దేవుని గురించీ ఆయన విధానాలూ ఉద్దేశ్యాల గురించీ సరైన అవగాహన కలిగున్నాడు. దేవుడే స్వయంగా దానిని ధృవీకరించాడు (యోబు 1:22, 2:10, 42:7). తీవ్రమైన శ్రమల గుండా వెళ్లిన దావీదు, కీర్తన 119:75 లో 'యెహోవా, నీ తీర్పులు న్యాయమైనవియు, విశ్వాస్యత గలవాడవై నీవు నన్ను శ్రమపరచితివనియు నేనెరుగుదును అన్నాడు. దావీదు, యోసేపు, యిర్మీయా, యోబు వంటివారు తమ జీవితాల్లో మహా శ్రమలనుభవించారు. అయినప్పటికీ, దేవునిపట్ల వారి అవగాహన, దేవునిలో వారికున్న సంబంధం వలన తమ శ్రమలంతటిలో దేవుని మంచితనాన్ని ఒప్పుకోగలిగారు. దేవుడు స్వాభావికంగా, సర్వవేళలా మంచివాడనేది బైబిల్ సత్యం.

***మనలోంచి ఒక మేలునూ మంచినీ బైటకు తేవాలనుకున్నప్పుడు, తీవ్రమైన బాధలోకి, వేదనలోకి ఆయన మనల్ని అనుమతిస్తాడు.***

అయినప్పటికీ మనలోంచి ఒక మేలునూ మంచినీ బైటకు తేవాలనుకున్నప్పుడు, తీవ్రమైన బాధలోకి, వేదనలోకి ఆయన మనల్ని అనుమతిస్తాడు. ఆయన సర్వజ్ఞానీ సహృదయుడూ సర్వశక్తిమంతుడూ సార్వభౌమాధికారీ కాబట్టి, ఒక సదుద్దేశంతో తెలిసీ, కావాలనీ ఆయన అనుమతిస్తే తప్ప మనకేదీ సంభవించదు. ఈ సత్యాన్నే నేను లేఖనాల నుండి నేర్చుకున్నాను. నా జీవితంలో అనుభవించాను. ఇతరులకు బోధించాను. ఈ సత్యమే నేను దేవున్ని నమ్మి, ఆయనకు నన్ను అప్పగించుకునేలా చేసింది. ధైర్యంతో, ధృఢ నమ్మకంతో నా శ్రమల గిన్నెను తాగగలిగేలా చేసింది.

## మనుషుల బాధల్లో దేవుని సార్వభౌమాధికారం

కేన్సర్ (ఆ మాట కొస్తే ప్రాణాంతకమైన ఏ వ్యాధైనా) ఒక వ్యక్తిని దేవుని సార్వభౌమాధికారాన్ని ముఖాముఖిగా ఎదుర్కొనేలా చేస్తుంది. కేన్సర్ ట్రీట్‌మెంట్ చాలా ఎక్కువకాలం తీసుకుంటుంది.

శారీరకంగా, మానసికంగానూ అతి దారుణమైన నొప్పి, బాధాకరంగా ఉంటుంది. (కీమోతెరపి, హార్మోనల్ తెరపి, రేడియో తెరపి, ఇంకా చాలా). చాలా కోల్పోవాల్సివస్తుంది. అన్ని రకాలుగా నలిపి, పిండి, పీల్చి పిప్పి చేస్తుంది. ట్రీట్‌మెంట్ తీసుకుంటున్న సమయంలో, నాలో అతిఘోరమైన, క్షీణమైన మార్పుల్ని చవిచూసాను.

1. నా జుట్టు కోల్పోయాను (నా కనుబొమలూ, కనురెప్పలతో సహా), 2. నా ఆకలినీ, చివరికి నాలుక మీది రుచిని కూడా కోల్పోయాను, 3. నా నిద్రను కోల్పోయాను, 4. నా చురుకైన జీవితాన్ని (పనిచేసే సామర్థ్యాన్నీ), నా పరిచర్యనూ కోల్పోయాను.

ఒకరోజు అద్దంలో నన్ను నేను చూసుకున్నప్పుడు, నమ్మలేక పోయాను. నా శరీరం నిండా మచ్చలూ (సర్జరీ, కీమోలవల్ల కలిగినవి), నల్లగా మాడిపోయిన చర్మం, జుట్టు లేకుండా (నా స్త్రీత్వపు విశిష్ఠ సంకేతం) ఎంత భయంకరంగా అగుపించానో! అయితే నా గాయాలూ మచ్చలూ కేవలం కొంతకాలమేననీ, దేవుని గాయాల గుర్తులు శాశ్వతమైనవనే సత్యాన్ని పరిశుద్ధాత్మ దేవుడు నాకు గుర్తు చేసాడు (యోహాను 20:27-29, ప్రకటన 5:6).

***నా గాయాలూ మచ్చలూ కేవలం కొంతకాలమేననీ, దేవుని గాయాల గుర్తులు శాశ్వతమైనవనే సత్యాన్ని పరిశుద్ధాత్మ దేవుడు నాకు గుర్తు చేసాడు***

ఏ లోపమూ, వికారమూ లేని మహిమ శరీరాన్ని ఒకరోజు నేను పొందుతాను. ఈ లోకములోనూ, రాబోయే లోకంలోనూ నాకు కొత్త జీవితాన్ని ఇచ్చేందుకే క్రీస్తు నా కోసం శ్రమలనుభవించాడన్న సత్యం నాకర్థమవ్వగానే నా హృదయం కృతజ్ఞతతోనూ స్తుతులతోనూ నిండిపోయింది. నా శ్రమలపట్ల, అది మిగిల్చిన మచ్చలపట్ల అప్పటి దాకా నాకున్న దృక్పథం మారిపోయింది.

'దేవుడు సార్వభౌమాధికారి' అని అంటున్నప్పుడు దేవుడు ఉద్దేశించి అనుమతిస్తే తప్ప మనకేదీ సంభవించదు అనే అర్థం అందులో ఉందని గ్రహించాను. సర్వాధికారి ఆయనే. పరిపాలించేదీ ఆయనే. సమస్త విశ్వమూ అందులోని మనందరి జీవితాలూ ఆయన అదుపులోనే ఉన్నాయి. ఆయన సంకల్పాల్ని ఏవీ భంగం

చేయలేవు. దేవుని ప్రేమ నుండి మనల్ని ఏదీ వేరు చేయలేదు. దేవుడు తన సార్వభౌమాధికారంతో మన జీవితాల్లోకి శ్రమను అనుమతించినప్పుడు, అది మనలోనూ, మన ద్వారానూ పురోగమింప చేస్తుందని గ్రహించాను. తన సంకెళ్లు దేవుని రాజ్యాన్ని మరింత వ్యాప్తి చేసాయనీ (ఫిలిప్పీ 1:12), మనం దేవుని దగ్గర నుండి పొందిన ఆదరణతో, కష్టాల్లో ఉన్న ఇతరుల్ని ఆదరించడం కోసం దేవుడు మన కష్టాల్లో మనల్ని ఆదరిస్తున్నాడనీ పౌలు అన్నాడు (2కొరింథీ 1:4). మన కొరకు శ్రమలను భవించిన, గాయాలైన రక్షకుడు, మన శ్రమల్లో మనతో పాటు శ్రమపడతాడు. మనకు సహాయం చేస్తాడు. ఆయనలా మనల్ని కూడా గాయపడిన వైద్యుల్లా చేస్తాడు. అప్పుడు మనం ఇతరుల శ్రమల్లో అర్థవంతంగా పాలిభాగస్థులమవుతాం. వారిని అర్థం చేసుకోగలుగుతాం. వారితో మమేకమవుతాం. ఈ బాధల ప్రపంచంలో వారికి పరిచర్య చేయగలుగుతాం. ఈ రెండేళ్లలో నా వ్యక్తిగత శ్రమానుభవం గుండా నేను వెళ్తున్నప్పుడు, నేను అనుభవ పూర్వకంగా తెలుసుకున్నది ఇదే. శ్రమల్లో ఉన్న ఎందరో పరిశుద్ధులకు దేవుని కృపను సున్నితంగా అందజేయగలిగాను. తద్వారా వారూ ఆదరణ పొందగలిగారు. ఎందుకంటే వారి శ్రమనూ బాధనూ నేను అర్థం చేసుకున్నానని వారు గ్రహించారు. ఒక విధంగా, ఇతరుల శ్రమల పట్ల ఇప్పుడు నేను మరింత సున్నితంగా స్పందించగలుగుతున్నాను. యేసుక్రీస్తు సారూప్యంలోకి ఒక్కింత మార్చబడ్డాను. ఇది మారువేషంలో ఉన్న ఆశీర్వాదం. "దేవుని ప్రణాళికలు మన జీవితాల్లో నెరవేరాలంటే బాధలు అనివార్యం" అని నేను గ్రహించడానికి ఇదంతా ఉపయోగపడింది.

> ***మన కొరకు శ్రమలను భవించిన, గాయాలైన రక్షకుడు, మన శ్రమల్లో మనతో పాటు శ్రమపడతాడు.***

**బాధలు – మన లక్ష్య సాధనకు మార్గం**

మన ప్రభువు యేసు, తన శ్రమల ద్వారా, ఈ లోకంలో తన లక్ష్యాన్ని నెరవేర్చాడు. తన సిలువనెత్తుకున్న క్రీస్తు తన శిష్యులు కూడా సిలువ మోయాలనీ, తనను అనుసరించాలనీ

ఆహ్వానిస్తున్నాడు. అదే విధంగా, చరిత్ర అంతటిలో యేసులాగానే ఆయన శిష్యులు కూడా, దేవుని లక్ష్యాన్ని నెరవేర్చడంలో తమ వంతు శ్రమల్ని అనుభవించారు. దేవుని ప్రణాళిక, ఉద్దేశ్యాన్ని నెరవేర్చడానికి మనం సిలువను లేక శ్రమను కౌగలించుకోవాల్సి ఉంది. మన భారాల్ని అనుదినం మోసే దేవుని కృప ద్వారా ఇది సాధ్యమవుతుంది (కీర్తన 68:19). మన బాధల్లో ఆయన బాధపడతాడు. మనల్ని మోస్తాడు. విమోచిస్తాడు (యెషయా 63:9). మన జీవితాల్లో ఏవైతే మనం అనుభవిస్తామో వాటన్నిటినీ ఆయన మనకోసం అనుభవించేసాడు. మన శ్రమల్లో ఆయన మనతో పాటు మన ఇమ్మానుయేలుగా, ఎబినేజరుగా ఉన్నాడు. ఆయన కృప చాలు. ఆయన ప్రేమ నిరంతరముంటుంది.

**ముగింపు**

ఈ సత్యాలన్నిటినీ గడచిన రెండేళ్లలో నేను అనుభవపూర్వకంగా తెలుసుకున్నాను. ఈ రెండేళ్ల రివ్యూటెస్టులు నార్మల్‌గా ఉన్నట్టు చూపించాయి. కాబట్టి నా శరీరంలో ఆయన స్వస్థత కార్యం జరుగుతున్నట్టుగా అర్థమైపోయింది. ఇక నా పట్ల దేవుని ప్రణాళికలు, ఉద్దేశ్యాలూ నెరవేర్చబడతాయని నిర్ధారించుకున్నాను. ఇప్పుడు మళ్లీ ఆయన్ని సేవించగలుగుతున్నాను. బైబిల్ గ్రీక్, ఇంకా ఇతర సబ్జెక్టులు బోధించగలుగుతున్నాను. మరణచ్ఛాయ లోయలలో గుండా మేము వెళ్ళినప్పుడు ఆయన మాతో కూడా ఉన్నాడు. ఆయన కృప మేమిప్పటికీ కొనసాగేలా చేస్తూనే ఉంది. మనందరికీ గాయాలుంటాయి. రకరకాల గాయాలు. మనవైన గాయాలు. భౌతిక, భావోద్రేక, మానసిక, ఆధ్యాత్మిక గాయాలు. శ్రమలూ, బాధలూ గాయాల ప్రపంచమిది. మన గాయాలపట్ల సరైన బైబిల్ వైఖరిని మనం అలవర్చుకోగలిగితే, మనం మన ప్రభువు యేసుక్రీస్తులాగా గాయాలు పొందిన వైద్యునిలా మారతాం. తద్వారా మన శ్రమ ద్వారా దేవుని ఉద్దేశ్యాల్నీ, లక్ష్యాల్ని నెరవేర్చగలుగుతాం. గాయాలు చేస్తూ, గాయాలు పొందుతున్న నేటి తరం ప్రజల మధ్యలో దేవుడు మనల్ని ఆయన ప్రతినిధులుగా,

***మన గాయాలపట్ల సరైన బైబిల్ వైఖరిని మనం అలవర్చుకో గలిగితే, మనం మన ప్రభువు యేసుక్రీస్తులాగా గాయాలు పొందిన వైద్యునిలా మారతాం.***

ఆయన కృపకు సాధనాలుగా ఉంచాడు. కాబట్టి మన తరంలో మనం గాయాలు మాన్పేవారిగా ఉండేలా ప్రభువు సహాయం చేయును గాక.

*నీ చేతుల్లో, కాళ్లలో మేకులు*
*అవి చెబుతున్నాయి*
*నీవెంతగా నన్ను ప్రేమిస్తున్నావో*

*నీ నుదుట దిగిన ముళ్లు*
*అవి చెబుతున్నాయి*
*నన్ను ప్రేమించేందుకు*
*నీవెంతటి బాధను ఓర్చుకున్నావో*

*ఆకాశాలు గతించినా*
*నీ గాయాలింకా నిలిచే ఉంటాయి*
*అవెప్పటికీ చెబుతూనే ఉంటాయి*
*నీవెంతగా నన్ను ప్రేమిస్తున్నావో*

***ఆకాశాలు గతించినా***
***నీ గాయాలింకా***
***నిలిచే ఉంటాయి!***

*నా ప్రేమ, నా హృదయం, నా జీవితం*
*ఎప్పటికీ, ఎప్పటికీ, మరెప్పటికీ*
*నీదే... నీదే... నీదే...*



*(శాంతి మొండితోక గారు ప్రస్తుతం హిత – హైదరాబాద్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ థియోలజీ అండ్ అపాలజిటిక్స్* ***(HITHA)*** *కు అకడమిక్ డీన్‌గా వ్యవహరిస్తున్నారు. 2009లో ఆమె రాసిన* ***'the wounded healer'*** *అనే ఈ వ్యాసం అనువాదానికీ, ప్రచురణకూ అనుమతించిన మొండితోక సుధాకర్ దంపతులకు కృతజ్ఞతలు).*